12311860l

# ప్రబోధ 33

ఖండ ఖండాంతర ఖ్యాతినార్జించిన
మహనీయులనుగన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గొన్న సమర భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీశక్తి జూపిన దివ్యభూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపిన యట్టి భరత భూమి
చిత్రకళల తోడ చిత్రమై యున్నట్టి
భరత భూమియందు జనన మంది
భరతమాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె భక్తులారా!

ప్రేమస్వరూపులారా!

భరత దేశంబు ఆరంజి పండు పోల్చ
కనగ జాతులు మతములు తొనలు కాదె
భిన్నతెగలు వృత్తులు అవి ఎన్నియున్న
భరత దేశాన పుట్టుటె భాగ్యమగును. కాదా మరి.
ఐక్య మత్యంబు జ్ఞానంబు నంద జేయు
దివ్యజ్యోతిని వెలిగించు దేశమిదియె

పవిత్రమైన భారత దేశము అనాది కాలమునుండియు ఆస్తిక్యాన్ని ప్రబోధిస్తూ ప్రచార ప్రబోధల చేత ఆచరణను అందిస్తూ వచ్చింది. లోకాస్సమస్తా సుఖినో భవంతు అన్నదే హైందవ సాంప్రదాయము యొక్క లక్ష్యము. ఇట్టి పవిత్ర భారత దేశమునందు జన్మించిన భారతీయుల యొక్క సుకృతము, అదృష్టము యెంతయో కాని యాడ దగినది.

సహస్ర శీర్షాః పురుషః సహస్రాక్ష సహస్రపాత్. అన్ని శిరస్సులు అన్ని నేత్రములు, అన్ని పాదములు అతని యొక్క అంగములే. విశ్వమే విష్ణుస్వరూపము. ప్రతి పదార్థమునందు అస్తి భాతి ప్రియ నామ రూపములనే ఐదు తత్వములు కూడివున్నవి.

మొదటి మూడైన సత్ చిత్ ఆనందములే మానవుని యొక్క నిజస్వరూపములు. నామరూపములు కల్పితములు. నిజముగా మానవుని యొక్క స్వభావము చాలా విచిత్రమైనది. నిర్మలమైనది. నిస్వార్థమైనది. కానీ ప్రాకృత దోషములు కొంత వుండటంచేత మానవత్వములో కొంత వరకు మాలిన్యము యేర్పడుతూ వచ్చింది. మానవుని యందు ఆవిర్భవించిన యీ సత్ చిత్ ఆనందము యొక్క తత్వాన్ని ప్రతి వ్యక్తి గుర్తించటం అత్యవసరము. మానవుని ఆవరించిన యీ అజ్ఞానము కేవలము మాటలతో పోవునది కాదు. ఎంత సంపద కల్గినప్పటికిని, ఎన్ని వుత్తమైన అధికారములు చేబట్టినప్పటికి, ఎంత విద్యావంతుడైనప్పటికిని, మనస్సునందు ఆవరించిన యీ అశాంతిని యేమాత్రము తొలగించలేవు. ఈ అజ్ఞానరోగమును తొలగించే దివ్య ఔషధము ఆత్మజ్ఞానము ఒక్కటి మాత్రమే.

ప్రేమస్వరూపులారా! మానవునకు లభించే సంతోషముగానీ, ఆనందముగానీ, సుఖముగానీ, ఐశ్వర్యముగానీ వీటిని చూచి మనము మురిసిపోరాదు. ఇది కేవలము రావటమే కాదు పోవటము జరుగుచున్నది. ఈ సుఖదుఃఖములనేవి వచ్చిపోయే బంధువుల వంటివి మాత్రమే. కనుక మానవత్వములో వుండిన దివ్యత్వాన్ని విస్మరించక క్షణికమైన లౌకిక భోగభాగ్యములకు లొంగక తనయొక్క స్వస్వరూపమును తాను గుర్తించుకొనుటకై తగిన ప్రయత్నము చేయాలి. మానవుని దేహము నీటిబుడగవంటిది. దీనిని ఆశ్రయించి మాత్రము మనము జీవించరాదు. సుఖమునకు ఎట్టి వికారమో దుఃఖమునకు అట్టి వికారమే. సుఖదుఃఖములు రెండు కూడను వికారములతో కూడినవే. ఇట్టి వికారస్వరూపములైన భావములను ఆవరించి, వరించి సత్యమైన స్వభావమును తాను మరచటం మానవుని యొక్క స్వభావము కానేరదు. ఆత్మ నిత్యమైనది. దేశకాలములకు అతీతమైనది. ఆత్మజ్ఞాన విచారణయే సనాతన ధర్మము. ఇట్టి ఆత్మజ్ఞాన విచారణా స్వరూపమైన సనాతన ధర్మమును అనుసరించుటయే జీవుని యొక్క ధర్మము. ఈ దేహము యొక్క తత్వము అంతమయ్యేది.

మలినపుకొంప రోగముల మ్రగ్గెడు సేవకగంపు జాతసం
చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం
బుల పదిలంబు మనమెప్పుదలంప దేహమింకని
శ్చలమని నమ్మబోకుము మనసా హరిపాదము లాశ్రయింపవే.

పంచభూతములు పాంచభౌతిక దేహమునే బాధించవచ్చును గానీ పంచభూతములకు అతీతమైన ఆత్మతత్వాన్ని యివి యేమాత్రము కూడను కదలించలేవు.

మానవుడు అనగా విశ్వాసము కలిగినవాడు. విశ్వసించతగినది

123118603

మానవత్వము. పవిత్రమైనది మానవత్వము. జీవించదగినది మానవత్వము. లక్ష్యమును వీడక మానవత్వమును సార్థకము గావించుకోటమే తనయొక్క కర్తవ్యము. శరీరము, మనస్సు ఆత్మల యొక్క కూడికనే మానవత్వము. ఈ మూడు మానవుని స్వభావమును నిరూపించుచున్నవి. మానవత్వాన్ని ఉన్నతస్థితికి గొనిపోవుచున్నది. వీటినే చేయుట, తెలుసుకొనుట, వుండుట అని దీనికొక అర్థము. చేయుట అనగా శరీర మాధ్యంబు ఖలు ధర్మసాధకం. ఈ శరీరము చేతనే అన్ని ధర్మకర్మలు ఆచరించుచూ వచ్చుచున్నవి. దేహమే లేకుండిన ఎట్టి ధర్మకర్మలు ఆచరించుటకు వీలుకాదు. కనుకనే సమస్త కర్మలు ఆచరించటానికి అనుకూలమైన కరణము యీ దేహము.

ఇక రెండవది మనస్సు. సంకల్పవికల్పాత్మకం మనః. నిరంతరము కూడను సంకల్పవికల్పముల చేతనే కూడి వుంటున్నది. మనోమూలమిదం జగత్. జగత్తంతయు కూడను మనోమయముగానే వుంటున్నది. మనస్సులేని పదార్థముగానీ, వ్యక్తిగానీ, విషయముగానీ యిందులో కానరాదు. మంచి చెడ్డల విచారణ కూడను మనసుద్వారానే జరుగుచున్నది. నిత్యానిత్యవిషయ పరిశీలన కూడను మనసు వల్లనే జరుగుచున్నది. కనుకనే మనసు తెలుసుకొనుట అని దీనికొక అర్థము.

ఇక ఆత్మ ఇది నిత్యమై, సత్యమై, నిర్మలమై, నిస్వార్థమై ప్రకాశవంతమైన స్వరూపము. ఇది ఎట్టి కూర్పుల చేత మార్పు చెందునది కాదు. ఇది మానవుని అంతరాత్మయందు పరంజ్యోతిగా వెలుగుచున్నది. దానినే దైవత్వమని కూడను పిలుచుచున్నవి శాస్త్రములు. భారతీయుల పవిత్రమైన శాస్త్రములు, చరిత్రములు యిట్టి అంతరాత్మను ప్రబోధించటమే జరుగుతూవస్తున్నది. భగవంతుడు ఆత్మస్వరూపుడని కూడను శాస్త్రములు బోధిస్తూ వచ్చినవి. హృదయ కుహరమందు ఆత్మస్వరూపుడై వున్నాడు అని ఉపనిషత్తులు బోధిస్తున్నవి. హృదయము పవిత్రమైనప్పుడే దైవత్వమును పొందుటకు సాధ్యమవుతుందని బైబులు వర్ణిస్తూ వచ్చింది. పవిత్ర కార్యములు ఆచరించి హృదయము నిర్మలమైన స్థితిలో వుంచుకోటమే దివ్యత్వమైన దైవత్వమని మహమ్మదీయుల ఖురాను బోధిస్తూవచ్చింది. సద్భావముల చేతను, సత్కర్మల చేతను, సత్ప్రవర్తనల చేతను మానవత్వమును నిరూపించటము, హృదయమే ప్రధానమని చెప్పి గురునానక్ బోధిస్తూ వచ్చాడు. ఏతావాతా సర్వమతముల యొక్క సారము, సర్వమార్గముల యొక్క గమ్యము హృదయము యొక్క పవిత్రతనే నిరూపిస్తూ వచ్చినది. కనుక ప్రేమ, సత్యము అనేవి కేవలము దేహమునకు సంబంధించినది కాదు. హృదయమునకు సంబంధించినవి.

మానవుడు నిజముగా ఆత్మస్వరూపుడే. అయితే తనయొక్క యిట్టి స్వరూ

123118604

పాన్ని మరచిపోయి క్షణికమైన, క్షుద్రమైన, లౌకికమైన యీ భోగభాగ్యములకు మురిసిపోయి భగవంతుని మరచిపోతున్నారు. ఈ లౌకిక సుఖములను ఆశించి వాటి నిమిత్తమై అనేక ప్రయత్నములు చేస్తున్నాడు మానవుడు. కడకు తన ప్రయత్నములు ఫలించక, సాధించిన దానిని పూర్తిగా అనుభవించలేక నిరాశచే, నిస్పృహతో జీవితాన్ని గడుపుతున్నాడు. కానీ నూటికి తొంభైవంతులు మానవులు నిర్విరామ కృషిచే, నిరంతర తాపత్రయములతో, అంతులేని ఆశలతో, అర్థము లేని ఆవేదనలతో అస్వాప్నరూప ప్రాప్తికై ప్రాకులాడుచూ తుదకు అశాంతిని అందుకుంటున్నారు. ఇంతటితో తనయొక్క ప్రయత్నమును విరమించుట లేదు. మానవుని యందుండిన మానవత్వాన్ని, దైవత్వాన్ని మరచిపోతున్నాడు. దానవత్వాన్ని పెంపొందింప చేసుకుంటున్నాడు. తన కుత్సానుప తన మగుట యేకాక తోటి మానవుని కూడను పతనము గావించుచున్నాడు. దీనికన్నింటికిని మూలకారణము ధర్మబద్ధమైన, నియమబద్ధమైన జీవితము అలక్ష్యము చేయుటమే.

ధర్మము అన్నింటికిని మూలమైనది. ధర్మమే గొప్పసుగుణము. ధర్మమనగా కేవలము మానవుడు నిత్యజీవితములో తమ తమ కర్తవ్యములను గుర్తించుకొనుటము ఆచరించుటము మాత్రమే కాదు. అనేక మంది ధర్మమనగా నీతికి పర్యాయ పదముగా భావిస్తున్నారు. ఇదిని జమైన ధర్మము కానేరదు. మానవుని యందు ఆవిర్భవించిన చైతన్యమును ఏకంగా సత్యపరముగా పట్టి వుంచుటమే నిజమైన ధర్మము. మానవుని యొక్క చైతన్యతత్వమును అహంకార భావముచే, అహంకార సూత్రముచే కట్టినప్పుడే యిది త్రిగుణ స్వరూపమైన ధర్మంగా యేర్పడుతుంది. సృష్టి చైతన్యమునే ఈశ్వరతత్వముగా మనము భావించినప్పుడు యిదియే నిజమైన ఆత్మ ధర్మముగా రూపొందుతుంది. ఏకాత్మ భావమును పొందటమే నిజమైన ధర్మము. బాహ్యమైన, లౌకికమైన యీ జగత్ సంబంధమైన కర్తవ్యములన్నికూడను కేవలము త్రిగుణ స్వరూపములైన ధర్మములే. స్వధర్మము. స్వ అనగా ఆత్మధర్మమే. పరధర్మమనగా దేహ ధర్మమే. దేహధర్మములు అనిత్యములు మార్పులతో కూడినది. యుగయుగములందు కూడను యిట్టి మార్పులు జరుగుతూనే వస్తున్నవి. కానీ యిట్టి ధర్మములు ఆత్మధర్మములుగా మనము విశ్వసించరాదు. గృహస్థ ధర్మములు, ఆశ్రమ ధర్మములు, వర్ణ ధర్మములు అనేవి అనేకరకములుగా వుంటున్నాయి. ఇవి కేవలము మానవుని యొక్క జీవనోపాధి నిమిత్తమై ఏర్పడినవి మాత్రమే. జీవిత పరమావధి సంబంధమైన ఆత్మతత్వాన్ని, ఆత్మధర్మాన్ని మనము అనుసరించాలి. కేవలము దేహధర్మము మాత్రమే అనుసరించుటముచేత మనము మృగములుగా తయారవుతున్నాము. ఇంక మనోధర్మమును ఆచరించినప్పుడు తాత్కాలికమైన మానవత్వము గా నిరూపిస్తూ వస్తున్నది. శారీరక మానసికములు రెండూ కూడి ఆత్మతో అనుబంధము చేసు

123[illegible]18605

కున్నప్పుడే యిది దైవత్వాన్ని పొందింపజేస్తుంది. దేహము చేయుట, మనస్సు ఆలోచించుట, ఆత్మసాక్షి భూతమై వుండుట. ఈ మూడింటి యొక్క కర్తవ్యములు వివిధములుగా వుండినప్పటికిని, యివి వేరువేరు మార్గములు ప్రవర్తించినప్పటికిని, అన్నింటికిని అన్యోన్య ఆశ్రయమనేది ఒకటున్నది. ఈ మూడు అవినాభావసంబంధము అయినప్పుడే మానవత్వము సార్థకము గావించుకోవచ్చు. ఈ మూడింటి యొక్క యేకత్వమే పూర్ణత్వమనే మార్గము ననుసరింపజేస్తుంది.

ధర్మార్థ కామమోక్షములు పురుషార్థములు. ఈ ధర్మముతోనే అర్థము నాశించాలి. అర్థ కామములు రెండును ధర్మము నాశ్రయించినప్పుడే యిది సార్థకమవుతుంది. ధర్మమును మాత్రము విసర్జించి, అర్థ కామములను మాత్రమే అత్మలు చూచినప్పుడు మన యొక్క జీవితము అశాంతికి గురౌతుంది. అర్థ కామములు ధర్మము నాచరించినప్పుడు మోక్షము మనకు సహజసిద్ధముగా యేర్పడుతుంది. మోహక్షయమే మోక్షమనే సులభ మార్గాన్ని మనము అనుసరించవచ్చు. కనుక మానవత్వమనేది కేవలము యీనాడు నూతనముగా యేర్పడినదికాదు. మా అనగా కాదు. నవ అంటే క్రొత్తది. మానవ అంటే యిది క్రొత్తది కాదు అని దీని అర్థము. ఎన్నో జన్మలనుంచి వచ్చేది పాతది, రోతది. కనుక ఎంత కాలమైననూ మన యొక్క మానవత్వాన్ని పాతగానే రోతగానే అనుభవిస్తుంటే నిజమైన స్వరూపాన్ని మనము ఎప్పుడు అనుభవించేది. కనుకనే సర్వము బ్రహ్మమయమనే స్వరూపాన్ని మనము నిరూపించాలి. సమాజములోనే సర్వస్వరూపమైన ఈశ్వరత్వాన్ని ఆవిర్భవింప జేసుకోవాలి. కనుకనే ఈశావాస్యమిదం సర్వం

చుక్కలన్నియు బ్రహ్మ సూర్యుండు బ్రహ్మ
చంద్రుడన్నను బ్రహ్మ జలము బ్రహ్మ
స్వర్గమన్నను బ్రహ్మ వైకుంఠమది బ్రహ్మ
తల్లి అన్నను బ్రహ్మ తండ్రి బ్రహ్మ
సంపదంతయు బ్రహ్మ వాల్లభ్యమది బ్రహ్మ
జీవరాసులు బ్రహ్మ జీవి బ్రహ్మ
పుట్టించుటది బ్రహ్మ పోషించుటది బ్రహ్మ
గిట్టించుటది బ్రహ్మ గృహాలి బ్రహ్మ
కాలమంతయు బ్రహ్మ కాయంబు అది బ్రహ్మ
ప్రకృతంతయు బ్రహ్మ ప్రాణంబు బ్రహ్మ

123118606

సర్వమును బ్రహ్మ మరియు ఈ సభయు బ్రహ్మ
సత్యమును చెప్పు బ్రహ్మ ఈ సాయి బ్రహ్మ.

సర్వమును బ్రహ్మమయమే. బ్రహ్మకు వేరైన పదార్థము మరొకటి లేదు. సర్వమును బ్రహ్మమయముగా వుండినప్పుడు మనము వెతుకుట యెక్కడ. తాను చిక్కుట ఎక్కడ.

విశ్వమంతా ప్రాణవిభుని మందిరమైన వీధివాకిలి యెక్కడ. విశ్వమంతా మందిరమైనప్పుడు వీధికి యింకెక్కడ స్థానముంది. వీధియే లేనప్పుడు యింక వాకిలి దీనికి ఎందుకు. విశ్వవిభుడే నీ హృదయేశ్వరుడు. వీణా తంత్రులు మీటి ప్రాణ తంత్రులు నాటి ఆనంద బాష్పములతో ఆత్మార్పణము చేయ అది యే వైకుంఠము. అది యే దైవత్వము. భగవంతుని యొక్క సంపదలుగాని, భగవంతుని యొక్క ఐశ్వర్యముగాని మనకు అనుకూల మార్గమున అందిస్తూ వచ్చాడు. ఆ ఐశ్వర్యమునకు వారసులే మీరందరు. అయితే ఆ ఐశ్వర్యమేమిటో మీరు గుర్తించటానికి ప్రయత్నించాలి.

సాయికున్నట్టి ఐశ్వర్యసంపదలకు
సాటి ఐశ్వర్యమున్నదె చ్చోటనైన
సాయి ఐశ్వర్యమేమన్న స్వార్థరహిత
నిత్య నిర్మల ప్రేమయే నిజము నిజము.

సాయి యొక్క ఐశ్వర్యములు, ఈ భవనములు, ఈ మందిరములు ఇవి కాదు సాయి ఐశ్వర్యములు సాయి యొక్క ఐశ్వర్యములు నిస్వార్థమైన నిర్మలమైన పవిత్రమైన ప్రేమ ఒక్కటి మాత్రమే. ఆ ప్రేమకు మీరు వారసులై, ఆ ప్రేమను మీరు అనుభవించి, ఆ ప్రేమను మీరు అందుకొని, ఆ ప్రేమను మీరు సరైన రీతిగా మీరు జగత్తుకు చాటుటయే మీ ప్రధాన కర్తవ్యము. సర్వవ్యాపి యైన, సర్వజ్ఞుడైన సర్వశక్తిమయుడైన భగవంతునికి మీరు అర్పితము చేసేది ఏమి యున్నది. కేవలము భ్రాంతి మాత్రమే. మానసిక తృప్తికై మీరు యిన్ని విధములైన అర్పితములు గావిస్తూ వస్తున్నారు.

బ్రహ్మాండమంతటు ప్రబలుచుండెడి తనకు
ఆలయమునమర్చ అలవియగున
కోటి సూర్యుల కాంతి మేటి గల్గిన తనకు
ప్రమిద దీపము నెవరు పట్టగలరు
అజహరాదులకైన అందనివాడు
తనరూపు కనుగొన నెవరి తరము
సర్వజీవులయందు సంచరించెడి తనకు
సరైన చోటిడ సాధ్యమగున

123118607

బ్రహ్మాండ మంతయు బొజ్జలోనుండగ
భక్ష్య భోజ్యంబు తనకు పెట్టతగున.
బ్రతుకు కోసము బహు బాధ బడ్డులైరి.

ఇది కేవలము మానవ జీవితము యొక్క ధన్యత కోసమై యీ విధమైన మార్గమును అనుసరిస్తూ వస్తున్నారే గాని, నిజముగా భగవంతుడు ఒకస్థానము, ఒకపేరు, ఒకరూపము అన్నది యెక్కడం కానరాదు.

భగవంతుని యే భావము చేత, యే హృదయము చేత, యే వాంఛల చేత ఆరాధింతురో ఆచరింతురో ఆరూపనామము లోనే భగవంతుని గుర్తించటానికి వీలవుతుంది. భగవంతుడు కల్పవృక్షము. కామధేనువు. ఎవరు ఆర్తి, అర్థార్థి, జిజ్ఞాసి, జ్ఞాని తనయొక్క స్థాయి నుండి ఏ విధమైన దానిని ప్రార్థించెదరో దానినే తాను అనుగ్రహిస్తున్నాడు. ప్రేమస్వరూపులారా భగవంతుని సులభముగా పొందుటకు ఒక్క ప్రేమ మాత్రమే ప్రధాన మార్గము. ప్రకాశించే చంద్రుని మనము చూడవలెనంటే చంద్రుని కాంతి చేతనే చంద్రుని చూడవచ్చును గాని ఆ చంద్రుని చూచుటకు ఏ పెట్రోమాక్సులైట్, ఏ టార్చిలైట్, ఏ హరికెన్ లైట్ మనకు అవసరము లేదు. భగవంతుడు ప్రేమస్వరూపుడు కనుక ఆ ప్రేమ ద్వారానే మనము గుర్తించుటకు ప్రయత్నించాలి.

కనుక ప్రేమనే మనయొక్క ప్రాణముగా విశ్వసించాలి. మానవుని నుండి మొట్టమొదట ఆవిర్భవించేది ఒక్క ప్రేమ మాత్రమే. తదుపరి యే అన్ని గుణములు కూడను ఆవిర్భవిస్తున్నవి. కనుక ప్రేమ రహితములైన హృదయములుగా వుండకూడదు. ప్రేమమయమైన జీవితాన్ని గడపాలి. మానవుని యొక్క భావములు అనేక విధములైన రాగములచేత కూడి వుంటాయి. రాగద్వేషములే మానవునకు ప్రధానమైన రాహుకేతువులు. నవగ్రహములని మనము భావిస్తున్నామే గాని యిది భ్రాంతి మాత్రమే. రెండు గ్రహములే మనలను బాధిస్తున్నాయి అవే రాగద్వేషములు. శంకరుల వారి శిష్యులలో తోటకుడనే వాడు ప్రశ్నిస్తాడు, 'గురుదేవా! జగత్తులో దిగ్విజయమును సాధించిన వాడు ఎవడు?' అన్నాడు. కేవలము రాజ్యములు సాధించిన వాడు విజయుడా, కానేరడు. హిమాలయ పర్వతమునెక్కి అక్కడ ఒక ధ్వజమును పెట్టి యిందులో ఒక వీరుడనని అనిపించుకోటం యిది ఒక వీరత్వము కాదు. సముద్రమును యీదగల్గినవాడు విజయాన్ని సాధించినవాడు కానేరడు. ఆటపాటలయందు విజయాన్ని సాధించిన వాడు విజయుడు కానేరడు. హిరణ్యాకశిపుడు సముద్రమునందు దిగి దానిని పరిశోధించినవాడు. మిన్నునుండి మన్ను మన్నునుండి మిన్ను కూడను చేయగలిగినవాడు. కాని సర్వత్ర తాను సంచరించి దైవత్వాన్ని గుర్తింప చేయుటానికి తగిన కృషి సల్పినవాడు. కాని అట్టివాడు కూడను విజయాన్ని సాధించలేక పోయాడు. నిజమైన విజయుడెవ్వరు? ఇంద్రియములను నిగ్రహించినవాడే నిజమైన విజయుడు. బాలుడైన ప్రహ్లాదుడు కూడను యింత

123118608

విజయమును సాధించిన హిరణ్యకశిపుని ఒక ప్రశ్న వేశాడు.

లోకములన్నియున్ ఘడియలోన జయించిన వాడవు
యింద్రియాలోకము చిత్తమున్ గెలువనేరవు

తండ్రీ క్షుద్రమైన, క్షణికమైన యీ రాజ్యమును నీవు సాధించటానికి, జయించటానికి ప్రయత్నిస్తున్నావు. యుద్ధములో దొరికి అడవులలో మృగములు లాగ మానవులను చంపినంత మాత్రమున వీరుడు కానేరడు. నీయందున్న మృగమును నీవు సంహరించటానికి తగిన కృషి చేయమన్నాడు. నీ దుర్గుణములనే యింద్రియములను నీవు మొట్టమొదట జయించమన్నాడు.

లోని శత్రువులకు లొంగిపోయినవాడు
బయటి రిపుల నెట్లు పట్టగలడు.

లోపలి శత్రువులకే లొంగిపోయినవాడు బయటి శత్రువులను యే రీతిగా తాను విజయము సాధించగలడు. ఇది అసాధ్యము. లోని శత్రువులను సంహరించాలంటే, లోని శత్రువులను జయించాలంటే ఒక్క ప్రేమ అస్త్రము మాత్రమే సరైన అస్త్రము. కనుక ప్రేమ చేతనే మన యొక్క జీవితము సార్థకము గావించుకొని, ప్రేమ చేతనే మనము అడ్డు తగిలే అరిషడ్వర్గములను జయించుకొని దివ్యత్వమైన దైవత్వమును మనము పొందటానికి తగిన కృషి చేయుటము అత్యవసరము.

మనుజ అనగా మనుచక్రవర్తి సంతతి వారు యీ మనుజులు. అని దీని అర్థము. అతని యొక్క సంతతి వారు అతని యొక్క ఆస్తినే మనము ఆశ్రయించాలి. అతని న్యాయము ధర్మము, సత్యము, ప్రేమ, సహనము, సానుభూతుల యొక్క గుణములే స్వభావములు. ఇలాంటి వీనిని మనము అనుసరించినప్పుడే అతని సంతతి అతని దీనికి వారసులుగా అవటానికి అధికారము వుంటుంది. ప్రేమ స్వరూపులారా! అందరు భగవంతుని బిడ్డలే. రూపనామములందుగాని, వేషభాషలయందుగాని వేరువేరు మార్గములు అనుసరించినప్పటికిని అందరికి ఒక్క ప్రభువు మాత్రమే వున్నాడు. తండ్రి ఒక్కడే. కనుకనే brotherhood of man fatherhood of God యీ రెండింటిని మనము సాధించాలి. ఈనాడు లోకములో అనేక విధములైన అశాంతుల చేత, అక్రమముల చేత, అనాచారముల చేత, అధర్మముల చేత మానవుడు కుళ్ళి కృశించి కృంగిపోవుచున్నాడు. ఇలాంటి పరిస్థితుల యందు మానవులు భగవద్విశ్వాసమును అభివృద్ధి గావించుకొని, మానవత్వాన్ని సార్థకము గావించుకొనే నిమిత్తమై ప్రేమాస్త్రములను చేతబట్టి దివ్యమైన సమాజమునందు ప్రవేశించి, సేవకావృత్తి యందు మీ జీవితమును సార్థకము గావించుకోవాలని నేను ఆశిస్తున్నాను. కేవలము దేహమునే ఆశ్రయించకండి. దేహమును మాత్రమే కాక మనస్సును కూడను మీరు ఆశ్రయించకండి. దేహమనస్సుల యొక్క తత్త్వము చేత ఆత్మను ఆశ్రయించండి. అట్టి ఆత్మను ఆశ్రయించిన వాడే ధన్యుడు కాగలడు. అదియే

యీనాడు మనము చేయవలసినది; జరుపవలసినది సేవలు. మానవత్వములో ప్రత్యేకమైన సాధనలు చేయకపోయినప్పటికిని సేవకావృత్తి లోపల జీవితాన్ని సార్థకము చేసుకోవాలి.

నవ విధ మార్గములలో ప్రాణసమానమైనది, మధ్యస్థాయిలో వుండినది సేవ. ఈ సేవ ద్వారానే ఆత్మార్పితము జరుగుతుంది. ఈ ఆత్మార్పితము జరిగినప్పుడే స్నేహము ప్రారంభమవుతుంది. ఈ స్నేహము చేతనే ఐక్యత చిక్కుతుంది.

శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం.

కనుక సర్వమానవులయందు ప్రకాశించే పరతత్వము ఆత్మతత్వమనే విశ్వసించండి. ఎవరిని మీరు గౌరవించినప్పటికిని, ఎవరికి మీరు నమస్కరించినప్పటికిని యిది దైవమునకు చెందుతుందనే భావాన్ని మీరు విశ్వసించాలి. ఇదియే భారతీయ శాస్త్రమందు 'సర్వజీవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అన్నారు. అదేవిధముగనే సర్వజీవ తిరస్కారం కేశవం ప్రతిగచ్ఛతి. ఎవరిని మనము తిరస్కరించినప్పటికిని అదికూడను కేశవునికే చేరుతుందన్నారు. కనుక వ్యక్తిగతమైన అభిప్రాయ భేదములు, ద్వేషములు ఎన్ని వుండినప్పటికిని ఆత్మతత్వమును మాత్రము ఏకత్వముగా భావించాలి.